ఆదిలాబాద్ వార్త
మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్
గురువారం 4, సెప్టెంబర్ 2025





# ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

* ఇందిరమ్మ ఇంటి కోసం 20 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్

మంచిర్యాల, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త

ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం పంచాయతీ సెక్రెటరీ 20వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గ్రామానికి చెందిన డోల్క నాగమణి తన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం బేస్ మెంట్ లెవల్ దాకా రావడంతో ఇందిరమ్మ ఇల్లు మొదటి విడత బిల్లు కోసం గ్రామ కార్యదర్శి అక్కల వెంకటస్వామిని పనుల ఫోటోలను అప్‌లోడ్ చేయమని నాగమణి కోరగా గ్రామ కార్యదర్శి అక్కల వెంకటస్వామి తనకు 30 వేల రూపాయలు ఇస్తేనే పనుల ఫోటోలను మిగతా 2లో..




# ఆదాయం ఘనం.. అభివృద్ధిలో శూన్యం




* ఎవరికి పట్టని బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి
* శిథిలావస్థకు చేరి బీటలువారిన భవనం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త

రాష్ట్రంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లలో ఒకటైన బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్ నేడు దయనీయ స్థితిలో కొట్టు మిట్టతాడుతోంది. కనీసం త్రాగు నీటి సౌకర్యం కూడా లేక పోవడంతో ప్రయాణీకులు నీటిని బయట కొనుక్కొని తెచ్చుకుంటున్నారు. భవనం అంతా శిథిలావస్థలోకి చేరి బీటలు పారి కూలిపోయే దయనీయ స్థితిలో కొట్టు మిట్టాడుతోంది. బెల్లంపల్లి లో బస్టాండ్ 36 ఏళ్ల క్రితం నిర్మించగా ఆలనా పాలనా లేక వెలవెలబోతోంది. కురుస్తున్న వర్షాలకు బస్టాండ్ భవనం స్లాబ్ పై భాగం అంతా ఉరుస్తూ ఉంది. భవనం పై భాగం గోడలు పగుళ్లు తేలి బీటలు పారి దీన స్థితిలో ఎప్పుడు కూలి పోతుందోనని తీవ్ర భయాందోళనలో ప్రయాణీకులు వ్యక్తం చేస్తున్నారు.

2 లో..



బస్టాండ్‌లో నీటి చుక్క రాని నల్లాలు

## సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

* ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 3. ప్రభాతవార్త

జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలతో కలిసి మిగతా 2లో..



## గని ప్రమాద ఘటనల్లో కారుణ్య వారసులకు డిగ్రీ విద్యార్హత ఉంటే గ్రేడ్3 క్లర్క్ పోస్టులకు అర్హత

* గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన నిర్మాణాత్మక సమావేశం మేరకు నిర్ణయం
* సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ

నస్పూర్, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త



గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల వారసులకు ఇచ్చే కారుణ్య నియామకాల్లో పట్టభద్రులైన అభ్యర్థులకు క్లరికల్ గ్రేడ్3 పోస్టులు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన 51 వ నిర్మాణాత్మక సమావేశంలో జరిగిన చర్చల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో త్వరలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో యాజమాన్యం ద్వైపాక్షి క ఒప్పందం, అనంతరం మిగతా

## గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

* రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్

నస్పూర్, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త



గ్రామీణ స్థాయిలో పరిపాలన సులభతరం చేసే విధంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారులకు నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలన అధికారుల నియామకం సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, నియామక ఉత్తర్వుల పంపిణీ, మిగతా 2లో..

# ఆదాయం ఘనం... అభివృద్ధిలో శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

బస్టాండ్ ప్రాంగణం చిట్టడివిని తలపిస్తోంది. చుట్టూ అడవిలా చెట్లతో, పిచ్చి మొక్కలతో నిండి పోయి భయానక వాతావరణాన్ని తలపిస్తోంది. రాత్రి వేళలో సరైన వీధిలైట్లు లేవు నామ మాత్రంగానే ఉన్నాయి. మిలుకు మిలుకు మనే లైట్లతోబస్టాండ్ చుట్టూ చీకటితో నిండి పోయి ఉంటుంది. రాత్రి 8 దాటితే ప్రయాణీకులు రాలేని, ఉండలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఇక్కడ నైట్ హాల్ట్ బస్సుల్లో ఉండే డ్రైవర్లు, కండక్టర్లు బిక్కు బిక్కు మంటూ గడపాల్సిందే... అంతే కాదు బెల్లంపల్లి పట్టణం, గోదావరిఖని, మంచిర్యాల, ఆసిఫాబాద్, కొత్తగూడెం, పరకాల, సిరిసిల్ల, డిపోలకు తల మాణికంగా ఆదాయ వనరుగా ఉంది. రోజు వారీగా ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు 25 వేల మంది, ఇతర ప్రాంతాలనుంచి బెల్లంపల్లి కి దాదాపు 20 వేల మంది వస్తూ ఉంటారు. రోజు వారిగా ఒక్క బెల్లంపల్లి నుంచే ఆర్టీసీ సంస్థకు లక్షల్లో ఆదా యం వస్తోంది. విచిత్ర మేమిటంటే ఈ బస్టాండ్‌లో గత నెల రోజులుగా స్వీపింగ్, టాయిలెట్ ల క్లీనింగ్ కాంటాక్ట్ ఐపోవడంతో క్లీనింగ్ నిలిచి పోయింది. దీంతో మూత్ర శాలలు, టాయిలెట్లు దుర్గం ధాన్ని వెద జల్లు తూందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.బస్టాండ్ కు రోజు వారీగా వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు ఒంటికి, రెంటికీ వచ్చిన వారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే లేదంటే ఆరుబయటకు వెళ్లాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. చివరన నిర్మించిన బస్టాండ్ రక్షణ లేకుండా పోయింది. కాగాబస్టాండ్ ప్రాంగణం ఆసిఫాబాద్ డిపో పరిధిలో కాంటా చౌరస్తా బస్టాప్ గోదావరిఖని డిపో పరిధిలో, రూరల్ బస్టాప్ మంచిర్యాల డిపో పరిధిలో ఉన్నాయి. ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు కోసం 1989,90లో ఇక్కడ 5 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రోజు వారీగా లక్షల్లో ఆదాయం వస్తున్నా 35 ఏళ్ళుగా ఇక్కడ బస్ డిపో ఏర్పాటు ఊసే లేదని ప్రజలు వాపోతున్నారు.



బెల్లంపల్లి రూరల్ బస్ స్టాప్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

## ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

(మొదటిపేజీ తరువాయి)

ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేస్తానని డిమాండ్ చేశాడు. నాగమణి పంచాయతీ కార్యదర్శికి 20 వేల రూపాయలు ఇచ్చుటకు ఒప్పదం కుదుర్చుకుంది. ఈ మేరకు బాధితురాలు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారుల సూచనల మేరకు బుధవారం పంచాయతీ కార్యదర్శి నాగమణి తన ఇంటికి రమ్మని 20 వేల రూపాయలు ఇస్తుండగా కరీంనగర్ ఏసీబీ, డిఎస్పి అదిలాబాద్ ఇన్చార్జి డిఎస్పి పి.విజయ్ కుమార్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి అక్కల వెంకటస్వామిని గ్రామపంచాయతీ కార్యాలయంకు తీసుకువచ్చి విచారణ జరిపి అరెస్టు చేసి కరీంనగర్ తరలిస్తున్నట్లు ఏసిపి, డిఎస్పి వెల్లడించారు. గురువారం ఉదయం ఎసిబి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరు డబ్బులు అడిగిన అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించాలని సూచించారు. బాధితులు ఎవరైనా ఉంటే తమకు నేరుగా సమాచారం అందించాలని డిఎస్పీ కోరారు. డీఎస్పీ వెంట ఇన్స్పెక్టర్లు కిరణ్, తిరుపతితో పాటు పోలీస్ కానిస్టేబుల్ సిబ్బంది ఉన్నారు. సంబరాలు చేసుకున్న గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యదర్శి పక్కల వెంకటస్వామిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారనే విషయం తెలియడంతో గ్రామస్తులు పెద్దఎత్తున జీపీ వద్దకు చేరుకున్నారు. డీఎస్పీ విజయ్ కుమార్ వెంకటస్వామి అరెస్టు వివరాలు వెల్లడిస్తుండగానే గ్రామస్తులు చప్పట్లతో అవినీతి అధికారి పీడ పోయిందని నినాదాలు చేశారు. అనంతరం సంబరాలు చేసుకున్నారు. ఇందిరమ్మ బిల్లులు, రేషన్ కార్డులు మంజూరు, మరణ ధ్రువీకరణ మంజూరులో కూడా చాల మంది లబ్ధిదారుల దగ్గర నుండి పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి డబ్బుల కోసం వసూలు చేశాడని గ్రామస్థులు ఆరోపించారు.

## గని ప్రమాద ఘటనల్లో కారుణ్య వారసులకు డిగ్రీ విద్యార్హత ఉంటే గ్రేడ్3 క్లర్క్ పోస్టులకు అర్హత

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో త్రైపాక్షి క ఒప్పందం చేసుకోనుంది. అనంతరం దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి. గతంలో ఈ విద్యార్హత కలిగిన వారు జనరల్ అసిస్టెంట్‌గా మాత్రమే పనిచేసే అవకాశం దక్కేది. అయితే 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలు మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమా(మైనింగ్/మెకానికల్/ ఎలక్ట్రికల్), ఐటీఐ(ఎలక్ట్రికల్/ ఫిట్టర్/వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు కల్పించడానికి అంగీకరించారు.

తాజాగా డిగ్రీ అర్హతను కూడా చేర్చి గ్రేడ్ 3 క్లర్కు ఉద్యోగాలను కల్పించడానికి నిర్ణయించడం జరిగింది. ఒకవేళ మరణించిన ఉద్యోగి కుటుంబంలో అర్హులైన టెక్నికల్ డిగ్రీ ఉన్న వారసులు లేనిపక్షంలోనే డిగ్రీ అర్హత ఉన్న వారిని గ్రేడ్ 3 క్లర్కు పోస్టు అభ్యర్థిత్వానికి పరిశీలించడం జరుగుతుంది. ఈ ఏడాది జూన్ 27వ తేదీన జరిగిన డైరెక్టర్ (పర్సనల్) స్థాయి నిర్మాణాత్మక సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ చేసిన ప్రతిపాదినపై యాజమాన్యం స్పందించి ఒక అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వారు ఈ అంశంపై లోతుగా చర్చించి నివేదికను సమర్పించారు. దీనిపై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ సానుకూలంగా స్పందిస్తూ ఇకపై గని ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికుల పట్ల సానుభూతితో స్పందించి వారి కుటుంబంలో డిగ్రీ విద్యార్హతలు గల వారసులకు గ్రేడ్ 3 క్లర్కు పోస్టుకు అర్హత కలిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

సంస్థలో గ్రేడ్ 3 క్లర్కు పోస్టుల లభ్యతను బట్టి కంపెనీ వీరికోసం నిర్వహించే ప్రత్యేక పరీక్షలో డిగ్రీ అర్హత గల వారసులు పాల్గొనాల్సి ఉంటుందని, పరీక్షలో పాసైన వారు మాత్రమే గ్రేడ్ 3 క్లర్క్ పోస్టుల నియామకానికి అర్హత సాధిస్తారు. గ్రేడ్ 3 క్లర్కు పోస్టుల అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కాని వారసులను క్యాటగిరి 1 జనరల్ అసిస్టెంట్‌గా గుర్తిస్తూ ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుంది.

## సంక్షేమ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామీ పథకం ఎ.పి.ఓ.లు, సెర్ప్ ఎ.పి.ఎం.లు, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుద్ధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, 100 శాతం ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని తెలిపారు. బేస్ మెంట్ నిర్మాణం ఆలస్యం చేసే వారిని గుర్తించి బ్యాంకు లింకేజీ, మండల సమాఖ్య ద్వారా ఇండ్ల నిర్మాణం ప్రారంభించని వారికి లక్ష రూపాయలు రుణము అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, విడతల వారీగా లబ్ధిదారుల పాత్రలో నిధులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద పి.వి.టి.జి లకు 100 శాతం ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల జాబితా అందించాలని తెలిపారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, అంగన్వాడి కేంద్రాల భవనాలు, పశువుల షెడ్లు, పౌల్ట్రీ షెడ్, గోట్ షెడ్ల నిర్మాణం చేపట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం చేయాలని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన రహదారులపై ఏర్పడిన గుంతలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, గ్రామాలలో పారిశుద్ధ్య పనులు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. గుంతలలో వర్షపు నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమల వృద్ధిని అరికట్టే విధంగా ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంపొందించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. వనమహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, హౌసింగ్ పి.డి. తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా గ్రామ పాలనా అధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమైనదిగా భావించి తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇన్చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే నియమించబడిన గ్రామ పాలన అధకారులను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లా నుండి హైదరాబాద్‌లోని హైటెక్ సిటీకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, సకాలంలో నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలన అధికారులుగా నియమించబడే వారికి తమ స్వగ్రామం, మండలం, నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వకూడదని, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దంపతులకు నిర్దిష్ట పరిస్థితులలో విశేష మినహాయింపులు ఇవ్వవచ్చని, సంబంధిత అంశాలను జిల్లా స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలనాధికారుల పోస్టింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ప్రతి క్లస్టర్ కు తగిన అభ్యర్థిని నియమించేందుకు జిల్లా కలెక్టర్ సమీక్షి ంచాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హైదరాబాద్‌లో జరగనున్న నియామక ఉత్తర్వులు పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు చెందిన గ్రామ పాలన అధికారులను సకాలంలో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి బస్సులో ఒక ఉపతహసిల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 8.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, గ్రామ పాలన అధికారులకు భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 15 శాతం లాభాల వాటా చెల్లించాలి

**- ఈ నెల 7న కాంట్రాక్టు కార్మికుల స్థితిగతులపై సదస్సు**

**- ఎస్‌సిసిడబ్ల్యుయూ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మనందం**

నస్పూర్, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త

సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 15 శాతం లాభాల వాటా చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మనందం అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సివిల్ డిపార్ట్మెంట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికుల స్థితిగతుల పైన సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ7న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు, ఈ సదస్సుకు భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, టి. శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఐ.కృష్ణ, ఎం. శ్రీనివాస్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు కాంట్రాక్టు కార్మికులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంటాక్ట్ కార్మికులకు యాజమాన్యం తక్షణమే వేతనాలు పెంచాలని, సీఎంపిఎఫ్ బుక్స్ ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచడంలో గుర్తింపు ప్రాతినిత సంఘాలు సింగరేణి యాజమాన్యం పైన ఒత్తిడి చేయడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ డివిజన్ నాయకులు శేఖర్, శంకర్, సత్యం, తిరుపతి, రాజన్న ,అప్పారావు, మాడుగుల శంకర్, మల్లేష్, సత్యం, నరసమ్మ, పుష్ప, శారద, దుర్గ తదితరులు పాల్గొన్నారు.


గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

# ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చే వరద ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలో ఎడతెరిప లేకుండా వర్షాలు కురుస్తున్నందున ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువన ఉన్న ఎస్ఆర్ఎస్పి, కడెం ప్రాజెక్టుల నుండి వరద నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక పెరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో కురిసిన వర్షాలతో వాగులు, చెరువుల నుండి సైతం వరద నీరు ప్రాజెక్టులోకి రావడంతో ఇన్ ఫ్లో అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రాజెక్టు నుండి నీటి అవుట్ ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

## బీసీ రిజర్వేషన్ బిల్లులను గవర్నర్ వెంటనే ఆమోదించాలి

జన్నారం, సెప్టెంబర్3, (ప్రభాతవార్త):

బీసీ రిజర్వేషన్ బిల్లులను తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వెంటనే ఆమోదించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకుడు కోడూరు చంద్రయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తులు, పురపాలికలు ,నగరపాలక, సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50 పరిమితిని ఎత్తివేసి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పంచాయతీరాజ్ పురపాలక చట్టాల సవరణ బిల్లులు రెండింటిని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదించాలని కోరారు. బీసీ కులాల వారికి రిజర్వేషన్ల విషయంలో న్యాయం జరిగేలా గవర్నర్ తక్షణమే ఈ రెండు బిల్లులను ఆమోదించి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మందమరి ఏరియా జీఎంగా రాధాకృష్ణ బాధ్యతలు

మందమర్రి, సెప్టెంబర్ 03 (ప్రభాతవార్త):



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్గా ఎన్.రాధాకృష్ణ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్.ఓ.టు.జి.ఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, ఐ.ఈ.డి ఎస్.ఈ కిరణ్ కుమార్, మందమర్రి ఏరియా పరిధిలోని అన్ని డిపార్టుమెంట్ల హెచ్.ఓ.డీలు పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా యొక్క స్థితిగతులను అన్ని డిపార్ట్మెంట్ల హెచ్.ఓడిలు కొత్తగా వచ్చిన ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణకు వివరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ మందమర్రి ఏరియా పరిధిలో ఉన్న భూగర్భ, ఉపరితల గనులలో కార్మికులు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి సమన్వయంతో అందరూ పని చేయాలని కోరారు. ఏరియాలో మేనేజర్గా పనిచేసిన అనుభవంతో సింగరేణి అభివృద్ధికి తోడ్పడుతూ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడతానని తెలిపారు.

## అక్రమంగా టేకు చెట్లు నరికిన వారిపై కేసు నమోదు

జన్నారం, సెప్టెంబర్3 (ప్రభాతవార్త):

జన్నారం మండలంలోని ఇంధనపెల్లి రేంజ్లో తొర్రే బీట్ పాలగొరి అటవీ ప్రాంతంలో అక్రమంగా గుడిసెలు వేసుకున్న ఆదిలాబాద్ జిల్లా నెట్నూర్, లింగాపూర్ మండలాలకు చెందిన 60 మంది గిరిజనులు మంగళవారం రాత్రి సుమారు 11 గంటలకు మరియు అర్ధరాత్రి 2 గంటలకు టేకు చెట్లు మరియు గైరి జాతికి చెందిన 52 చెట్లను అక్రమంగా నరికివేశారు. అక్కడే డ్యూటీ లో ఉన్న 14 మంది అటవీ ఎంత వారించిన వినకుండా వారిని నెట్టివేసి చెట్లను ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న లక్షేటిపేట సి.ఐ రమణ మూర్తి, ఇంధనపెల్లి ఎఫ్.ఆర్.ఓ శ్రీధర చారి, ఎస్.ఐ గొల్లపెల్లి అనూష అక్కడికి వెళ్లి పరిస్థితులను సమీక్షి ంచి, గిరిజనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చెట్లను నరికిన వారిపై కేసులు నమోదు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా అడవులను నరకడం చట్టారీత్యా నేరమని భూమి కావాలంటే కలెక్టర్ ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కాపువాడలో కాబులి తెల్ల శనిగలుతో కొలువు తీరిన గణనాథుడు

### - పర్యావరణ పరిరక్షణకు సందేశమిచ్చే వినాయకుడు

కాగజ్ నగర్, సెప్టెంబర్ 2, ప్రభాత వార్త



కాగజ్నగర్ పట్టణంలోని కాపువాడలోని శ్రీ సాయి గణేష్ మండలి వారు వినాయక చవితి సందర్భంగా ప్రతీ ఏటా ప్రత్యేకతతో గణేశుని విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకుని గత 14 సంవత్సరాలుగా తినదగిన, ప్రకృతి సంరక్షణకు అనుకూలమైన పదార్థాలతో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. ఈ సంవత్సరం 24వ ఏడాదిగా గణేశుని విగ్రహాన్ని 16 కిలోల కాబులి తెల్ల శనిగ గింజలతో తయారు చేసి ప్రతిష్టించారు. ఈ విగ్రహాన్ని 6400 గింజలతో రూపొందించారని మండలి సభ్యులు తెలిపారు. ప్రకృతికి హానికరం కాని పదార్థాలతో రూపొందించిన ఈ గణనాథుడు పర్యావరణ పరిరక్షణకు ఒక మంచి సందేశంగా నిలుస్తున్నాడు. అదేవిధంగా వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు రాత్రి 8 గంటలకు, కాపువాడ రైల్వే ఫ్లైఓవర్ దిగే ఎడమవైపున ఉన్న మండపం వద్ద శ్రీ సాయి గణేష్ మండల్ సభ్యులు అన్నదాన కార్యక్రమం మండలి సభ్యులు, దాతల సహకారంతో నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ మహాప్రసాదాన్ని ప్రతి ఒక్కరు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

## వరద నీటితో... గర్భిణీలకు ఆపద

సిర్పూర్(టి), సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త)



హుడికిలి బ్రిడ్జి పైకి వర్ధ నీరు రావడంతో జక్కాపూర్, మాకిడి ,హుడికిలి, గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. గర్భిణులు వైద్యం కోసం సిర్పూర్ రావాల్సి ఉండగా వరదనీరు ఆటంకం ఏర్పడింది. మహారాష్ట్రలోని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో ఈ ప్రాంతానికి వరద నీరు చేరుతుంది. హుడికిలి బ్రిడ్జి వద్ద రెవెన్యూ , పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. సంబంధిత సిబ్బంది తహసిల్దార్ రహీముద్దీన్ కు సమాచారం అందించడంతో హుడికిలి బ్రిడ్జి వద్ద అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ సాయంతో గర్భిణీలను సిర్పూర్ వైపు దాటించారు. అనంతరం వైద్యం కోసం గర్భిణులను సెక్రటరీ అశోక్, వైద్య సిబ్బంది అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు.

# క్షేత్ర స్థాయి పంటనష్టం అంచనా

వేమనపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త

ఇటీవల రాష్ట వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత బ్యాక్ వాటర్తో వరదలు వచ్చి వేమనపల్లి మండలంలో వందల ఎకరాల పత్తి,వరి పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అట్టి పరిస్థితినీ మాజీ జడ్పీటీసీ సంతోష్ కుమార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పంటనష్టం అంచనా తొందర వేసేలా కృషి చేశారు. పంటనష్టం సర్వేలో భాగంగా బుధవారం కేతనపల్లి,కల్మల పేట,సుంపుటం,వేమనపల్లి,నీల్వాయి శివార్లలో మండల వ్యవసాయ అధికారి వీరన్న,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీతో కలిసి క్షేత్ర స్థాయిలో పంటనష్ట సర్వే నిర్వహించారు. వీరితో వ్యవసాయ విస్తరణ అధికారులు హెస్బిబా,రోక్సర్ సుల్తానా,మాజీ సర్పంచులు కుబిడే కిష్టయ్య,తోకల రాంచందర్,మాజీ ఉప సర్పంచులు తిరుపతి రెడ్డి,మధుసూదన్,నాయకులు మంత్రి రమేష్,శ్రీరాములు రమేష్, కుబిడే నాణేష్, రవి, శేఖర్, కొండా రాజేష్, తోకల తిరుపతి, డొబ్బల సంతోష్, బాపు, బీమ్ కారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



## చంద్రవెల్లిలో సోమేశ్వరాలయంలో 108 నైవేద్యాల నివేదన

బెల్లంపల్లి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త



బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి శ్రీ అన్నపూర్ణ సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా ఎనిమిదవ రోజు బుధవారం విఘ్నేశ్వరునికి శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర దేవాలయ కమిటీ, సేవకుల ఆధ్వర్యంలో స్వామివారికి 108 నైవేద్యాల నివేదన చేయడం జరిగింది. దేవాలయంలో జరిగే గణపతి నవరాత్రుల ఉత్సవాలలో సందర్భంగా తొమ్మిది రోజులపాటు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈరోజు అన్నదాత రామగోని గంగాధర్ గౌడ్ వారి కుమారుడు శైలజ అనిల్ గౌడ్ దంపతులచే అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## వర్షానికి కూలిన పెంకుటిల్లు

వేమనపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త

ఇటీవల కురుస్తున్న వర్షాలకు వేమనపల్లి మండలంలోని నీల్వాయి గ్రామానికి చెందిన చింతకింది పోశక్క పెంకుటిళ్ళు గోడలు కూలిపోయాయి. బాధితురాలు గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ కి సమాచారం అందించగా కూలిన పెంకుటిల్లు ను పరిశీలించారు. ప్రభుత్వం పరంగా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరుతుంది.

## గుండెపోటుతో మృతి చెందిన ఏ.ఆర్ ఎస్.ఐ జగదీష్ చంద్రమండల్

### - మృతదేహానికి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 2, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ మండలం ఇస్గాం నజురుల్ నగర్‌కి చెందిన ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు ఏ.ఆర్.ఎస్.ఐగా పనిచేస్తున్న జగదీష్ చంద్రమండల్ (55) నిన్న రాత్రి తన స్వగ్రామంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈరోజు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, జగదీష్ చంద్రమండల్ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జగదీష్ చంద్రమండల్ 1993లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరారు, 32 ఏళ్ల సర్వీస్‌లో హెడ్ కానిస్టేబుల్, ఏ.ఆర్ ఎస్.ఐగా పదోన్నతి పొంది అత్యున్నత సేవలు అందించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయం కింద రూపాయిలు 30,000 వారి కుటుంబ సభ్యులకు అందించి, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ అడ్మిన్ పెద్దన్న, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజశంకర్ రెడ్డి, కాగజ్ నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, ఆర్.ఐ ఎం.టి.ఓ అంజన్న, ఇస్గం ఎస్సై కళ్యాణ్, 1993 బ్యాచ్ పోలీసులు, ఎ.ఆర్ హెడ్ క్వార్టర్స్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# యూరియా, ఎరువులు పంట సాగుకు అనుగుణంగా పంపిణీ చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త

జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో యూరియా, ఎరువులు కార్యాచరణ ప్రకారం పంపిణీ చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఛత్రు నాయక్‌తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యూరియా, ఎరువుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో యూరియా, ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో కార్యాచరణ ప్రకారం రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా, ఎరువుల నిల్వలు పరిశీలించి దుకాణ యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పాస్ మిషన్లలో నమోదు చేయబడిన వివరాలు,



అధికారులతో మాట్లాడుతున్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలలో నిల్వ ఉన్న ఎరువుల వివరాలలో ఎలాంటి విభేదాలు ఉండకూడదని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాల నుండి అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు జారీ చేసి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణంలో ధరల వివరాలు, నిల్వ ఉన్న ఎరువుల వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. పంట సాగు చేస్తున్న రైతులు, సాగు చేయని రైతుల వివరాలు సేకరించి నివేదిక అందించాలని తెలిపారు. కాలానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంటల వివరాలు, సాగు మెలకువలను రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట సాగు విస్తీర్ణం, యూరియా, ఎరువుల పంపిణీ, పంట సాగు చేసే రైతుల వివరాలు తదితర అన్ని అంశాలు అనుసంధానమై ఉంటాయని, నివేదిక స్పష్టంగా ఉన్నట్లయితే వరి ధాన్యం, పత్తి, ఇతర పంటల దిగుబడి, కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### చదువులో వెనుకబడిన విద్యార్థులపై

# ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి

### - ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి

### - ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నస్పూర్, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్మా ఆధ్వర్యంలో బుధవారం నస్పూర్ పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో మంచిర్యాల జిల్లాకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి, ఎంఈవో పద్మజ, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అభినందనలు తెలియజేశారు. రోజు రోజుకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఉపాధ్యాయులు నూతన విద్యా విధానంపై దృష్టిసారించాలని సూచించారు. 2026..27 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో కొత్త విద్యా పాలసీ రాబోతుందని, దీంతో విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకోబోతున్నట్లు చెప్పారు. పిల్లలకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని, ముఖ్యంగా పిల్లలతో ఎక్కువగా ప్రాక్టీస్ చేపిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ సబ్జెక్టులపై పట్టుసాధిస్తే విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దవచ్చని సూచించారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ట్రస్మా ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు త్వరలోనే హెల్త్ స్కీంను ప్రారంభించడం జరుగుతుందన్నారు. తాము ఇతర సంఘాల మాదిరిగా కాకుండా ఒక క్రమశిక్షణతో విద్యా సంస్థలను నడిపిస్తూ విద్యాబోధన, ఉపాధ్యాయుల సంక్షేమం, పలు సేవా కార్యక్రమాలను స్వంత ఖర్చులతో చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులను, ప్రైవేటు పాఠశాలల్లో విద్యా బోధన చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న పలువురిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, రజనీ, రేగళ్ల ఉపేందర్, మైదం రామకృష్ణ, ఊట్ల సత్యనారాయణ, అంబాల రాజ్ కుమార్, పెట్టం మల్లయ్య, బత్తిని దేవన్న, కృష్ణారెడ్డి, అమన్ ప్రసాద్, జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, ట్రస్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ హరిత విద్యాలయ శిక్షణా కార్యక్రమం



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ మండలంలోని ప్రతి పాఠశాల స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని దీన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలలో టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం, హ్యాండ్‌వాష్ అలవాట్లు, జీవన నైపుణ్య శిక్షణ, విద్యార్థుల స్వీయాభివృద్ధి వంటి అంశాల వివరాలను స్వచ్ఛ హరిత విద్యాలయ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందించిన సదుపాయాలు, పాఠశాలలలో అమలు చేస్తున్న కార్యక్రమాలన్నీ రికార్డులలో ఉండాలని, రాష్ట్రం మరియు కేంద్ర స్థాయిల బృందాలు పరిశీలన తర్వాతే ర్యాంకులను కేటాయిస్తాయని వివరించారు. అదేవిధంగా పాఠశాలల్లో శుభ్రత, పర్యావరణ పరిరక్షణ, హరిత వాతావరణ సృష్టి, విద్యార్థులలో శుభ్రత అలవాట్ల పెంపుదల వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిస్ట్రిక్ నోడల్ ఆఫీసర్ జాడి దేవాజీ, డిస్ట్రిక్ సైన్స్ ఆఫీసర్ శ్రీకటకం మధుకర్, మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్టేట్ రిసోర్స్ పర్సన్స్ మామిడాల తిరుపతయ్య, శాంతి కుమార్, మండల రిసోర్స్ పర్సన్స్ బాలకృష్ణ, దామోదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వ్యవసాయ యాంత్రీకరణ అభివృద్ధి దిశగా చర్యలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త**

వ్యవసాయ సాగును సులభతరం చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, బ్యాంకింగ్, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖల అధికారులతో వ్యవసాయ యాంత్రికరణ, జాతీయ ఆహార భద్రత పథకం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల శారీరక శ్రమను తగ్గించి వ్యవసాయ సాగులో పనిముట్ల వినియోగాన్ని పెంపొందించి పంట సాగును సులభతరం చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో 2025 26 సంవత్సరానికి గాను పథకం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని మండలాలలో లబ్ధిదారుల ఎంపికకు కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. మొక్కల సంరక్షణ, ట్రాక్టర్ సహాయ పరికరాలతో పాటు వివిధ రకాలైన పరికరాలను వినియోగించి జిల్లాలోని 3 వేల 458 హెక్టార్లలో పంట సాగు కొరకు 2 కోట్ల 35 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ పథకంలో ఎస్.సి., ఎస్. టి., మహిళా రైతులు, చిన్న కమతాల రైతులకు 50 శాతం రాయితీ, పెద్ద కమతాలు, మిగతా రైతులకు 40 శాతం రాయితీతో పరికరాలు అందించడం జరుగుతుందని తెలిపారు. జాతీయ ఆహార భద్రత, పోషణ పథకం క్రింద 2025 26 సంవత్సరానికి గాను వానాకాలం 2025, యాసంగి 2025 26 గాను 4 వేల 432 హెక్టార్లలో వరి ధాన్యం, పప్పు ధాన్యాలు, పత్తి పంటలు సాగు చేసేందుకు 57 లక్షల రూపాయలతో లక్ష్యాలను ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ పథకం క్రింద వానాకాలం 2025కు గాను 100 శాతం రాయితీతో 24 క్వింటాళ్ల వరి (డెమో), 50 శాతం రాయితీతో 66.8 క్వింటాళ్ల వరి (సాధారణ) విత్తనాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఈ పథకం అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వరి విత్తనాలతో పాటు సేంద్రియ ఎరువులు, పి.పి. కెమికల్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంపొందించే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భుక్యా ఛాత్రు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# పరవళ్ళు తొక్కుతున్న పెనగంగ...

**నీట మునిగిన పంటలు...**

**సిర్పూర్(టి ), సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త)**



వెంకట్రావుపేట్ .. పోడుసల మధ్య ఉన్న పెన్ గంగా నది పరవళ్ళు తొక్కుతోంది. మహారాష్ట్రలోని ఎగవ ప్రాంతంలోని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో భారీగా వర్దనీరు ఈ ప్రాంతానికి చేరుతోంది. సిర్పూర్ నుండి మహారాష్ట్రకు వెళ్లే రహదారిలో మధ్యలో ఉన్న హుడికిలి బ్రిడ్జి పైకి వరద నీరు చేరింది. దీంతో మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా బ్రిడ్జ్ ఆనుకొని వరదనీరు ప్రవహిస్తోంది. టోంకిని, పారిగాం ప్రాంతంలోని పత్తి, వరి, కంది, మొక్కజొన్న పంటలు నీటి మునగాయి. వరద నీటితో ఆరుగాలం శ్రమించి రైతులు వేసుకున్న పంట కళ్ళముందే పంటలు మునిగిపోతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ప్రతిసారి పంటలు నష్టపోతున్న ప్రభుత్వం నష్టపరిహారం అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకట్రావుపేట్, పొడుస మధ్య ఉన్న బెడ్స్ పై నుండి భారీగా వర్ద నీరు ప్రవహించడంతో ఇరువైపులా రాకపోకలు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది నిలిపివేశారు. బ్రిడ్జ్ వద్ద పోలీసులు రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. మత్స్యకారులు ఎవరు చేపల వేటకు వెళ్ళవద్దని అధికారులు సూచనలు జారీ చేశారు. వాహనాలు వెళ్లకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## విధుల్లో నిరక్ష్యం వహిస్తే చర్యలు

**వేమనపల్లి, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త**

విధుల్లో నిరక్ష ్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఓ కుమారస్వామి అన్నారు. బుధవారం సుంపుటం గ్రామపంచాయతీనీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జాజులపేట దగ్గర గ్రిడ్ పైప్ లైన్ డ్యామేజ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, అలాగే వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచి స్వచ్ఛమైన త్రాగు నీరు సరఫరా చేయాలని,రోడ్డుపై నిల్వ నీరు ఉన్న ప్రదేశాల్లలో ఆయిల్ బాల్స్ వేయాలని, బైలార్వా, బ్లీచింగ్ స్ప్రే చేయాలని, డ్రైన్‌లు రోడ్లను నిరంతరంగా శుభ్రపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## మందమర్రి కేకేఓసిని సందర్శించిన జనరల్ మేనేజర్ రాధాకృష్ణ

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త**



నూతన జిఎంను సన్మానిస్తున్న కేకే ఓసి అధికారులు

సింగరేణి మందమరి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మందమర్రి కేకే ఓసిని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ ఎన్. వెంకట వంశీధర్ శాలువా కప్పి బొకే అందించి సాదరంగా స్వాగతం పలికారు. జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ వినాయక పూజలో పాల్గొని అన్నప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డంపర్స్ విభాగాన్ని పరిశీలించి, యంత్రాలకు అవసరమైన విడిభాగాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని, బ్రేక్ డౌన్లను తగ్గించి పరికరాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్శనలో ఎస్ ఓ టు జీఎం ఆర్. విజయ ప్రసాద్, ఎస్ఈ(ఐఈ) కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు అందించాలి

**- ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త):**



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా తోడ్పాటు అందించడం జరుగుతుందని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ఇందిరా మహిళ శక్తి పథకం క్రింద ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు కుందారపు రాణికి 10 లక్షల రూపాయలతో మంజూరైన మొబైల్ చేపల విక్రయ వాహనం యూనిట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపారాలు చేసేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు 4 లక్షల రూపాయల సొంత నిధులు, 6 లక్షల రూపాయల ప్రభుత్వ రాయితీ నిధులతో సంచార చేపల విక్రయ వాహనం నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందని, మహిళలు వ్యాపారాలు నిర్వహించి ఆర్థిక స్వావలంబన పొందడమే కాకుండా కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్లు యశోద, యాదగిరి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.